అక్షర దర్బార్
వెల ₹5
www.aksharadarbar.com voice of the people
మంగళవారం 18, మార్చి 2025 | సంపుటి :02 | సంచిక :35 | పేజీలు :05

CHEATING

# చీటింగ్..

- ఓ అటవీ అధికారి మోసం
- వ్యక్తిగత అకౌంట్ లో తునికాకు బోనస్, కూలీల డబ్బు జమ
- కేసు నమోదుతో నాకేం తెలియదని బుకాయిస్తున్న అధికారి

– వివరాలు 5వ పేజీలో ..



## 3 గ్రూపులుగా 59 కులాలు

- ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం
- మద్దతిచ్చిన అన్ని పార్టీల సభ్యులు

– వివరాలు 5వ పేజీలో ..



పాకాల తూముల మరమ్మత్తుకు

## నిధులివ్వండి


- నర్సంపేట ప్రజల దాహార్తి తీర్చేందుకు నిధులు మంజూరు చేయాలి
- పేదల ఇండ్లపై ఉన్న హై వోల్టేజ్ విద్యుత్ వైర్లను తొలగించాలి
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

2

## 15 మంది డీఎస్పీలకు ప్రమోషన్

- అదనపు ఎస్పీలుగా పదోన్నతి
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

2




# ఇల్లీగల్ రిజిస్ట్రేషన్స్ !

హన్మకొండ జిల్లా కేంద్రంలోని ప్రశాంత్‌నగర్‌లో గల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు పాతరేసిన కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అనుమతిలేని లేఅవుట్లు, వెంచర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తూ భారీగా దండుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొందరు డాక్యు మెంట్ రైటర్ల ద్వారా ఈ తతంగం కొనసాగుతు న్నట్లు తెలుస్తోంది. అంతేగాక అనుమతిలేని అపార్ట్‌మెం ట్లు, నాలా కన్వర్షన్‌లేని లే అవుట్‌లకు గజాల చొప్పున కమీ షన్ వసూలు చేస్తూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు సమాచారం. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతు న్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నిన్న ఒక్కరోజే ప్రశాంత్‌నగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సుమారు 22 నాన్ లేఅవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ హసన్‌పర్తి మండలంలోని చింతగట్టు గ్రామ రెవెన్యూ పరిధిలోనివిగా తెలుస్తోంది. అనుమతి లేదంటూ ఇంతకాలం పెండింగ్‌లో పెట్టిన ఈ 22 డాక్యుమెంట్లకు చకచకా అనుమతు లు మంజూవడంతో అధికారుల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి.

—అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- హన్మకొండ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ఇష్టారాజ్యం !
- నాన్ లేఅవుట్ ప్లాట్లకు అనుమతులు ?
- ఒక్కో డాక్యుమెంట్‌కు సుమారు రూ.5 వేల వరకు..
- గజాల చొప్పున కమీషన్ వసూలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వైనం
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు




నిందితుల వివరాలను వెల్లడిస్తున్న వరంగల్ నగర కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

03

## ఇన్‌స్టాతో వల..

# డ్రగ్స్‌తో ఎర !

- విద్యార్థినులు, యువతులే టార్గెట్
- మాయమాటలతో వ్యభిచారంలోకి ..!
- వరంగల్‌లో కిలాడీ లేడీ గ్యాంగ్ గుట్టు రట్టు
- ఆరుగురి ముఠా సభ్యుల అరెస్ట్
- నగరంలో మైనర్ బాలిక కిడ్నాప్ కేసును చేధించిన పోలీసులు
- విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి..
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్‌లో కిలాడీ లేడీ గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి, డ్రగ్స్ మత్తులో యు వతి చేసిన అరాచకాలకు పోలీసులే అవాక్కయ్యారు. నగ రంలో ఓ మైనర్ బాలికను అపహరించి అత్యాచారానికి పా ల్పడిన అనంతరం వ్యభిచారం చేయించేందుకు యత్నించి న కేసులో కిలాడీ లేడీతోపాటు ఐదుగురు సభ్యుల ముఠాను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు ముస్కు లత (ల్యాదేళ్ళ గ్రామం, దామెర మండలం, వరం గల్ జిల్లా) మైనర్ బాలిక, శంభునిపేటకు చెందిన అబ్బుల్ అఫ్నాన్, షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్, మీర్జా ఫైజ్ బేగ్ ఆలియాస్ మసూద్‌ను మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. వీరి నుంచి కిలో ఎనిమిది వందల గ్రాముల గంజాయి, కారు, రూ.75 వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లతోపాటు ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద భారీ స్థాయిలో కండోమ్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు.

— అక్షరదర్బార్, వరంగల్



3లో

రాజలింగమూర్తి హత్య కేసులో

# హరిబాబు అరెస్ట్

పరకాల మున్సిపాలిటీలో

# రెడ్ నోటీసులు

- రంగంలోకి దిగిన కమిషనర్
- 100శాతం పన్నుల వసూళ్లకు ప్రణాళికలు
- బకాయిలు చెల్లించకుంటే ఆస్తులు సీజ్
- ఒక్కో యజమాని ఇంటి పన్ను లక్షల్లో..

4

మంగళవారం
18.03.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక




- హన్మకొండ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ఇష్టారాజ్యం !
- నాన్ లేఅవుట్ ప్లాట్లకు అనుమతులు ?
- ఒక్కో డాక్యుమెంట్‌కు సుమారు రూ.5 వేల వరకు..
- గజాల చొప్పున కమీషన్ వసూలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వైనం
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

# ఇల్లీగల్ రిజిస్ట్రేషన్స్ !

**అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి:**

హన్మకొండ జిల్లా కేంద్రంలోని ప్రశాంత్‌నగర్‌లో గల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు పాతరేసిన కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అనుమతిలేని లేఅవుట్లు, వెంచర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తూ భారీగా దండుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొందరు డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఈ తతంగం కొనసాగుతు న్నట్లు తెలుస్తోంది. అంతేగాక అనుమతిలేని అపార్ట్‌మెం ట్లు, నాలా కన్వర్షన్‌లేని లే అవుట్‌లకు గజాల చొప్పున కమీషన్ వసూలు చేస్తూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు సమాచారం. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నట్లు తెలుస్తోంది.

## 22 నాన్ లే అవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ !

నిబంధనలకు విరుద్ధంగా నిన్న ఒక్కరోజే ప్రశాంత్‌నగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సుమారు 22 నాన్ లేఅవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ హసన్‌పర్తి మండలంలోని చింతగట్టు గ్రామ రెవెన్యూ పరిధిలోనివిగా తెలుస్తోంది. అనుమతి లేదంటూ ఇంతకాలం పెండిం గ్‌లో పెట్టిన ఈ 22 డాక్యుమెంట్లకు చకచకా అనుమతు లు మంజూవడంతో అధికారుల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇందుకోసం ఒక్కో డాక్యుమెంట్‌కు సుమారు రూ. 3,500 నుంచి 5 వేల వరకు రైటర్ల ద్వారా వసూలు చేసినట్లు సమాచారం. ఇవేగాక అనధికార లే అవుట్లకు పెద్ద మొత్తంలో కమీషన్ వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నగరంలో నాలుగు అంతస్తులకే అనుమతులు తీసుకొని ఐదు నిర్మించి ఇటీవల అపార్ట్మెంట్‌ను రిజిస్ట్రేషన్ చేసినందుకు కార్యాలయంలో పనిచేసే ఓ కీలక అధికారికి ఏకంగా రూ. 50 లక్షల వరకు ముడుపులు ముట్ట చెప్పినట్లు సమాచారం. తాజాగా కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులు కార్యాలయ ఆవరణలో మీటింగ్ ఏర్పాటు చేసి నాన్ లేఅవుట్ ప్లాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషన్ చేయకూడదని ఆదేశించినప్పటికీ వాటిని కొందరు అధికారులు భేఖాతర్ చేస్తున్నట్లు ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు సమాచారం. కాగా ఇదే విషయమై కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌ను వివరణ కోరగా.. ఆరోపణలన్నీ అవాస్తమని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే తాము రిజిస్ట్రేషన్లు చేపడుతున్నామని చెప్పారు.




# 15 మంది డీఎస్పీలకు ప్రమోషన్

*** అదనపు ఎస్పీలుగా పదోన్నతి**

*** ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం**

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలో పని చేస్తున్న 15 మంది డీఎస్పీలు అదనపు ఎస్పీలుగా పదోన్నతి పొందారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న 15 మంది డీఎస్పీలకు పదోన్నతి కల్పిస్తూ డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బాబ్జీ, శ్రీకాంత్, శ్రీనివాస్‌రావు, కుషల్కర్, నరేందర్, వెంకటరమణ, చంద్రకాంత్, రఘు, పూర్ణచందర్, హనుమంతరావు, కే శ్రీనివాసరావు, రమేష్, సుదర్శన్, ఉదయ్‌రెడ్డి, శ్యాంప్రసాద్ రావు పదోన్నతి పొందినవారిలో ఉన్నారు.

# రాజీవ్ యువ వికాస్ ను సద్వినియోగం చేసుకోండి

**యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాదు నాగరాజు**




అక్షర దర్బార్,శాయంపేట : శాయంపేట మండలంలోని నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాదు నాగరాజు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కార్పొరేషన్ల ద్వారా రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా దాదాపు 5 లక్షల మందికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు.



# తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

అక్షర దర్బార్,శాయంపేట : పత్తిపాక గ్రామానికి చెందిన గిరబోయిన రాజు తాను విలేకరి అని చెప్పుకుంటూ ట్రాక్టర్ డ్రైవర్ల పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడని గ్రామానికి చెందిన కోమల్ రెడ్డి, యాదగిరి, మహేష్ పేర్కొన్నారు. గత వారం రోజుల క్రితం పత్తిపాక గ్రామంలో రైతుల అవసరాల కోసం ట్రాక్టర్ డ్రైవర్లు మొరం పోశారని, కానీ ఇదే గ్రామానికి చెందిన విలేకరి అని చలామణి అవుతున్న గిరబోయిన రాజు డ్రైవర్లపై తప్పుడు ప్రచారం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ట్రాక్టర్ డ్రైవర్లు వైద్యుల దేవేందర్ రెడ్డి, గంట రాము, అన్నెబోయిన కిషన్, అజయ్, నవీన్ ఆరోపించారు. విలేకరి ముసుగులో అర్ధరాత్రి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని వారు ఆరోపించారు. డబ్బులు ఇవ్వనందుకే తప్పుడు వార్తలు రాసి అధికారులను తప్పుదోవ పట్టించి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ల పై విష ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా విలేకరి ముసుగులో చేసే తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట వేయకపోతే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# విద్యార్థులకు ప్యాడ్స్, పెన్స్ పంపిణీ



అక్షర దర్బార్, మల్హార్ : మండలాన్ని పదో తరగతి ఫలితాల్లో పాఠశాలను జిల్లా స్థాయిలో నిలపాలని సఫోర్ట్ టు ఫౌండేషన్ నిర్వాహకులు వీరమనేని సంపత్ రావు అన్నారు. తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, వల్లెంకుంట లో పదవ తరగతి విద్యార్థులకు 66 మంది విద్యార్థులకు ప్యాడ్స్ పెన్స్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు వీరమనేని సంపత్ రావు, పేరాల వెంకటేశ్వరరావు, కామ సమ్మయ్య, చెన్నూరు దేవదానం, ఒళ్ళల రమేష్, చిలకమారి వెంకటరాజు, తాడిచర్ల హై స్కూల్ హెడ్మాస్టర్ సిహెచ్ తిరుపతి రెడ్డి, కుమారస్వామి, శివలింగం, పూర్ణచందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

## పాకాల తూములు, లైనింగ్ మరమ్మత్తుకు

# నిధులు మంజూరు చేయండి

- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- నర్సంపేట ప్రజల దాహార్తి తీర్చేందుకు నిధులు మంజూరు చేయాలి
- పేదల ఇండ్లపై ఉన్న హై వోల్టేజ్ విద్యుత్ వైర్లను తొలగించాలి



అక్షర దర్బార్, నర్సంపేట : తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా మంగళవారం నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి నియోజకవర్గ సమస్యలపై ప్రసంగించారు. పాకాల సరస్సు నుండి అధికారికంగా 30 వేల ఎకరాలు అనధికారికంగా మరో 10 వేల ఎకరాల్లో రెండు పంటలు సాగవుతున్నాయని, చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లడానికి కాలువలు మరమ్మత్తు చేయాలని, తూముల లీకేజీ ద్వారా ఐదారు వేల ఎకరాలకు ఉపయోగపడే నీరు వృథాగా పోతుందని వాటి మరమ్మత్తుకు నిధులు కేటాయించాలని కోరారు. పై పనుల కోసం గతంలోనే కోరామని ఉప ముఖ్యమంత్రి నుండి ఆమోదం పొందినా ఇంకా పనుల మంజూరుకి నిధులు ఇవ్వలేదని వెంటనే నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నర్సంపేట పట్టణంలో సుమారు 70 వేల జనాభాకు తాగునీటి కోసం మిషన్ భగీరథ ఏర్పాటు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అందక ఇబ్బందులు పడుతున్నారని , డీఫ్లోరైడ్ ప్రాజెక్ట్ మరమ్మత్తు ద్వారా పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందే అవకాశం ఉందని అట్టి పనులకు సైతం అంచనాలు పంపించామని, పేదల ఇండ్లపై నుండి వెళ్తున్న హై వోల్టేజ్ వైర్లు తొలగించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

## పరకాల బస్టాండ్ లో చలివేంద్రం ప్రారంభం

అక్షర దర్బార్, పరకాల : పరకాల బస్ స్టేషన్ లో శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరకాల పట్టణానికి చెందిన అరుణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ యజమాని గందె వెంకటేశ్వర్లు , సంజయ్ మెడికల్స్ యజమాని నాగబండి సంజయ్, గంగా వాటర్ ప్లాంట్ యజమాని ఇమ్మడి లక్ష్మణ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండాకాలం మండుటెం డల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరకాల బస్ డిపో ఎస్ టీ ఐ.కృష్ణకుమారి, బస్టాండ్ ఇన్చార్జి సురేంద ర్, డిపో కంట్రోలర్ రమేష్, సీఆర్సీ తిరుపతి, విలేజీ బ స్సు ఆఫీసర్ సదానందం, బస్ డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాతలు

## రాజలింగమూర్తి హత్య కేసులో హరిబాబు అరెస్ట్

- మరో ఇద్దరు నిందితులు కూడా..
- వెల్లడించిన భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : గత నెల భూపాలపల్లి పట్టణంలో జరిగిన నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో ప్రధాన నిందితుడైన కాశీంపల్లి గ్రామానికి చెందిన కొత్త హరిబాబుతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం ప్రకారం హరిబాబు పారిపోవడానికి సహకరించిన ములుగు జిల్లాకి చెందిన వట్టే రమణయ్య, రమ అనే ఇద్దరు వ్యక్తులను కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని, ఈ అరెస్ట్ నిమిత్తమై మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఢిల్లీ, జైపూర్ ,ఆగ్రా తదితర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించి, చివరికి నిందితుడిని ఆచూకీ తెలుసుకొని అరెస్టు చేయడం జరిగిందని సిఐ తెలిపారు. ఇప్పటికే అరెస్టు అయిన నిందితులను మరల పోలీస్ కస్టడీ తీసుకొని పూర్తిస్థాయిలో విచారించి తదుపరి చర్య తీసుకోబడుతుందని, భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్



వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

## ఇన్‌స్టాతో వల..

# డ్రగ్స్‌తో ఎర !

- విద్యార్థినులు, యువతులే టార్గెట్
- మాయమాటలతో వ్యభిచారంలోకి ..!
- వరంగల్‌లో కిలాడీ లేడీ గ్యాంగ్ గుట్టు రట్టు
- ఆరుగురి ముఠా సభ్యుల అరెస్ట్
- నగరంలో మైనర్ బాలిక కిడ్నాప్ కేసును చేధించిన పోలీసులు
- విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి..
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్‌లో కిలాడీ లేడీ గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి, డ్రగ్స్ మత్తులో యువతి చేసిన అరాచకాలకు పోలీసులే అవాక్కయ్యారు. నగరంలో ఓ మైనర్ బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడిన అనంతరం వ్యభిచారం చేయించేందుకు యత్నించిన కేసులో కిలాడీ లేడీతోపాటు ఐదుగురు సభ్యుల ముఠాను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు ముస్కు లత (ల్యాదేళ్ళ గ్రామం, దామెర మండలం, వరంగల్ జిల్లా) మైనర్ బాలిక, శంభునిపేటకు చెందిన అబ్దుల్ అఫ్నాన్, షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్, మీర్జా ఫైజ్ బేగ్ ఆలియాస్ మసూద్‌ను మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. వీరి నుంచి కిలో ఎనిమిది వందల గ్రాముల గంజాయి, కారు, రూ.75 వేల నగదు, నాలుగు సెల్ ఫోన్ల తోపాటు ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద భారీ స్థాయిలో కండోమ్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు.

### డ్రగ్స్ అలవాటు చేసి అత్యాచారం..

మైనర్ నిందితురాలు ఇన్‌స్టా ద్వారా బాధిత బాలికతో పరిచయం పెంచుకోవడమే కాకుండా స్కూల్ వెళ్ళే సమయంలో కలిసేది. ప్రియుడైన నిందితుడు అబ్దుల్ అఫ్నాన్‌తో కలిసి బాలికను తీసుకవెళ్ళి మద్యం, గంజాయి తాగించడం అలవాటు చేశారు. బాలికను షాపింగ్ మాల్స్‌కు తీసుకవెళ్ళి బట్టలను ఇప్పించడంతో వీరిపై మరింత నమ్మకం కలిగింది. ఈక్రమంలోనే ఈనెల 11న మైనర్ బాలికను నమ్మించి నిందితురాలు తన ప్రియుడితో పాటు మరో ఇద్దరు నిందితులైన షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్‌తో కలిసి కారులో బయలుదేరి గంజాయి విక్రయించే మీర్జా ఫైజ్ బేగ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి నర్సంపేట శివారు ప్రాంతంలో షేక్‌సైలాని బాబాకు చెందిన పురాతన ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ గంజాయి తాగించి షేక్ సైలాని బాబా బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం నువ్వు రేపటి నుండి మేము చెప్పినట్లుగా వినాలని, లేకుంటే గంజాయి తాగుతుండగా, అత్యాచారం చేసేది సెల్‌ఫోన్లో చిత్రికరించామని (వాస్తవంగా వీడియా తీయలేదు) వీడియోను బయటపెడటామని బెదిరించి సదరు మైనర్ బాలికను ములుగు క్రాస్ రోడ్డు వదిలి అక్కడి నుండి పారిపోయారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మిల్స్ కాలనీ ఇన్స్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సైలు శ్రీకాంత్, సురేష్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

### వ్యభిచారంతో డబ్బు సంపాదించాలని..

ఈనెల 11వ తేదీన మైనర్ బాలిక కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సదరు బాలికను ములుగు క్రాస్ రోడ్డు వద్ద గుర్తించి పోలీసుల సంరక్షణలో విచారించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనను కొంతమంది వ్యక్తులు అపహరించి, గంజాయి తాగించిన అనంతరం అత్యాచారానికి పాల్పడినట్లుగా సదరు బాలిక వెల్లడించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీపీ ఆదేశాల మేరకు సెంట్రల్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో వరంగల్ ఏసీపీ అధ్వర్యంలో ఏర్పడిన మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలు నిందితులను నిందితులను పట్టుకొని తమదైన స్టైల్‌లో విచారించగా వీరి బాగోతం బయటపడింది. ప్రధాన నిందితురాలైన ముస్కు లత ల్యాదేళ్ళ గ్రామంలో వ్యభిచార వృత్తిని కొనసాగించేది. తల్లిదండ్రులు మరణించడంతో మరో మైనర్ నిందితురాలికి తన ఇంట్లో ఆశ్రయం కల్పించింది. బాలికలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహించడం ద్వారా పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని, అందులో నీకు కొంత ఇస్తానని తెలపడంతో ఈ ఆఫర్‌కు మైనర్ నిందితురాలు సిద్ధపడింది.



## ‘ఉపాధి’ పనులను సందర్శించిన డీఆర్డీవో

అక్షర దర్బార్, మల్హర్ : మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పరిధిలో వాటర్ హార్వెస్టింగ్ కమ్యూనిటీ పాండ్ పనులను డీఆర్డీవో సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు అందజేశారు. కొలతల ప్రకారం పని చేస్తే ఒక్క రోజుకు రూ.300 వస్తాయని కూలీలకు సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు మంచి నీళ్లు, నీడ పందిరి, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ హరీష్, టెక్నికల్ అసిస్టెంట్స్ రమేష్, శైలజ, శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్స్ రాజేందర్, కూలీలు పాల్గొన్నారు.

## లేఅవుట్ క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : లే అవుట్ క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. మంగళవారం ఐడీఓసి కార్యాలయ సమావేశపు హాలులో ఎల్ ఆర్ ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియపై లే అవుట్స్ ఓనర్లు, లైసెన్స్ సర్వేయర్లు, డాక్యుమెంట్ రైటర్స్ తో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న ఎల్ఆర్ఎస్(లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం) అమలులో వేగం పెంచాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ఈ నెలాఖరు వరకు ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25 శాతం రాయితీ అవకాశం కల్పించిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఒక లే అవుట్ లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉంటే, మిగిలిపోయిన



90 శాతం ప్లాట్లకు ఎల్అర్ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్ కు అవకాశం కల్పించారని, అలాంటి వారికి కూడా మార్చి 31 వరకు 25 శాతం రాయితీ పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా 31 లోగా ఎల్ఆర్ఎస్ చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తిస్తుందని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 8,312 ఇంటి ప్లాట్లు, 60 లేఅవుట్స్ కు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 4,909 మందికి క్రమబద్ధీకరణ సమాచారం అందినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులు రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతి రాజ్ శాఖల అధికారులు విచారణ చేయనున్నారని అన్నారు.

మంగళవారం
18.03.2025
www.aksharadarbar.com
అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆర్టీవి రిపోర్టర్

## పరామర్శించిన ఝాన్సీ రెడ్డి

అక్షర దర్బార్,తొర్రూరు : మండలంలోని నాంచారి మడూరు గ్రామానికి చెందిన ఆర్టీవి సీనియర్ రిపోర్టర్ యాకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వేల్పుల అంజలిఐలయ్య మామ వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను మంగళవారం ఝాన్సీరెడ్డి పరామర్శించారు.



# మాజీ మంత్రి నివాళి..

అక్షర దర్బార్ సంగెం : వరంగల్ జిల్లా సంగెం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,మాజీ జెడ్పీటీసీ పసునూరి సారంగపాణి తల్లి లచ్చమ్మ మృతి చెందగా విషయం తెలుసుకున్న వెంటనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి కాపులకనపర్తిలో ఆమె పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు.






# పరకాల మున్సిపాలిటీలో రెడ్ నోటీసులు

- రంగంలోకి దిగిన కమిషనర్
- 100శాతం పన్నుల వసూళ్లకు ప్రణాళికలు
- బకాయిలు చెల్లించకుంటే ఆస్తులు సీజ్
- ఒక్కో యజమాని ఇంటి పన్ను లక్షల్లో..
- పైరవీలు చేస్తున్న యజమానులు
- 50వేల పైచిలుకు ఇండ్లకు నోటీసులు : మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీలో పెండింగ్ లో ఉన్న ఇంటి పన్నులు, నల్ల బిల్లులు, గృహ, వాణిజ్య, వ్యాపార సంస్థల పన్నుల వసుల కోసం రంగంలోకి దిగిన మున్సిపాలిటీ కమిషనర్. కమిషనర్ ఆధ్వర్యంలో ఆరు టీములుగా ఏర్పాటు చేసి 100% ఇంటి పనులు వసూలు చేసేందుకు ప్రణాళికలు ఏర్పాటు చేశారు. పన్నులు చెల్లించని మొండి బకాయిదారులను గుర్తించిన అధికారులు వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసు అందుకున్న వాళ్లు మూడు నుంచి వారం రోజుల్లో బకాయిలు చెల్లించాలి. లేదంటే వారి ఆస్తులను సీజ్ లేదా జప్తు చేస్తారు. ఒక్కో యజమాని ఆస్తి పన్ను లక్షల్లో పెండింగ్‌లో ఉండటం గమనార్హం. గతంలో పదేళ్ల పాటు ఒకే ప్రభుత్వం అధికారంలో ఉండటం, పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వారిలో మెజారిటీ సభ్యులకు అప్పటి అధికార పార్టీ అండదండలు ఉండటంతో బకాయిదారుల వద్దకు వెళ్లినప్పుడల్లా అధికారులకు ఫోన్‌లు వచ్చేవి. దాంతో బకాయి మొత్తం కాకుండా ఎంతోకొంత ముట్టుజెపుతూ కాలం వెళ్లదీశారు. దాంతో పరకాల మున్సిపాలిటీలో మొత్తం మూడు కోట్ల 58 లక్షలు బకాయిలు ఉండగా ఇప్పటివరకు ఒక కోటి 89 ,63 లక్షలు వసూలు చేశారు. ఇంకా కోటి 65 లక్షల పన్నులు వసూలు చేయాల్సిందిగా తెలిసింది. దాదాపు 52 % వసులు అయినట్లు సమాచారం.

### పేరుకుపోయిన బకాయిలు

పరకాల మున్సిపాలిటీలో 27 వ్యాపార సముదాయలకు మున్సిపాలిటీ కార్యాలయం లీజుకు ఇచ్చి వారి వద్ద నుండి నెలకు రూ. 4 లక్షల కిరాయి వసూలు చేయాల్సి ఉంది. కొన్ని నెలలుగా మున్సిపాలిటీకి రావాల్సిన కిరాయిలు భారీగా పేరుకుపోయాయి. సుమారు రూ. 45 లక్షల వరకు వసూలు కావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు 31 శాతం మాత్రమే వసూలు అయినట్లు తెలిసింది.

### పైరవీలు షురూ

ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు చెల్లించాలని అడగడంతో అంత మొత్తం చెల్లించలేక నాయకుల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేస్తున్నారు. మరికొందరు కొన్నాళ్లు ఇలానే హడావిడి చేసి వదిలేస్తారన్న ధీమాలో ఉన్నారు. అయితే బకాయిల వసూలుకు సమయం ఇస్తూ విడతలుగా వసూలు చేస్తే చాలావరకు వసూలు అయ్యే అవకాశం ఉంది.పరకాలలో మున్సిపాలిటీ అధికారులు అలసత్వం వహించకుండా 100% పన్నులు వసూలు చేసి పరకాలను క్లీన్ పరకాలగా చేయాలని పలువురు కోరుతున్నారు.

### 50 వేల పైచిలుకు ఇండ్లకు నోటీసులు..



50 వేలకు పైచిలుకు బకాయిలు ఉన్న 20 ఇండ్ల యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. టీములుగా ఏర్పాటు చేసి పరకాలలో 100%బకాయిలను వసూలు చేసుడే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ప్రతి ఏరియాలో తిరుగుతూ ఏవైనా ఇంటి పర్మిషన్ లేకుంటే వారిని కూడా గుర్తిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం పేరు చెప్పి ఎవరైనా ఫోన్ పే, గూగుల్ పే చేయమని అడిగితే సైబర్ నేరంగా గుర్తించాలని మున్సిపల్ కార్యాలయం ఎవరి నుండి ఫోన్ పే, గూగుల్ పే తీసుకోదని.. మీరు కార్యాలయానికి వచ్చి పన్నులు కట్టి రసీదు తీసుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు.

—మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

# ఎమ్మార్పీఎస్ దీక్షకు జర్నలిస్టుల సంఘీభావం..

అక్షర దర్బార్, పరకాల : షెడ్యూల్ కులాల వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని మందకృష్ణ మాదిగా పిలుపుమేరకు పరకాల పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీ ఆధ్వర్యంలో 9వ రోజు రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏక శంకర్ మాదిగ. అసెంబ్లీలో ప్రవేశపెట్టినటు వంటి షెడ్యూల్ కులాల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ తో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు పరకాల మండల పరిధిలోని జర్నలిస్టులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘం నాయకులు దాసరి రమేష్, ఎండి పాష, మాదిగ జర్నలిస్టు ఫోరం నాయకులు కోడెపాక భాస్కర్ మాదిగ, విద్యా సమైక్య బొచ్చు నవదీప్ మాదిగ, ఏకు కృష్ణ, ఒంటేరు పరమేష్ మాదిగ, బొచ్చు రాకేష్ పాల్గొన్నారు.




# మహిళలకు శిక్షణ సభ్యత్వం



అక్షర దర్బార్, పరకాల : పరకాలలో తెలంగాణ ప్రదేశ్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ఒక్కరోజు నాయకత్వ శిక్షణ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ హన్మకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బొచ్చు కోమల మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాలలో ప్రభుత్వ పథకాల్లో మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొచ్చు అనంతరావు, రెండవ వార్డ్ సోషల్ మీడియా ఇంన్ఛార్జ్ బొచ్చు జెమిని, ఇందిరమ్మ కమిటీ మెంబర్ బొచ్చు అనిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పేరుక చరణ్, బొచ్చు మౌనిక, బొచ్చు కవిత, బొచ్చు భద్ర, బొచ్చు శారద, బొచ్చు దశకోటి, రాహుల్, రాంబాబు, వెన్నెల, గుర్రం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# చల్లా పరామర్శ..

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ శాతరాశి రమాదేవి అనారోగ్యంతో భాద పడుతుండగా మంగళవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆమెను పరామర్శించారు.





# రాజీవ్ యువ వికాసం పథకం పట్ల సంబరాలు...

అక్షర దర్బార్, కాటారం: తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో రాజీవ్ వికాసం పథకం ప్రారంభించిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ కాటారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్ వద్ద టపాసులు కాల్చుతూ నినాదాలు చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఐటి మినిస్టర్ శ్రీధర్ బాబు,ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం లకు ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు గద్దల రమేష్ కృతజ్ఞతలు తెలియచేసారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, నాయకులు నీలాల సమ్మయ్య, నీలాల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఫొటో జర్నలిస్టులను సన్మానించిన ప్రెస్ క్లబ్

అక్షరదర్బార్, వరంగల్: హైదరాబాద్ బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అనుబంధ సంఘం తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డుల కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న వరంగల్ ఫొటో జర్నలిస్టులు వీరగోని హరీష్, గొట్టె వెంకన్న, దాసరి శ్రీనివాసులును గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ముగ్గురు ఫోటో జర్నలిస్టులకు శాలువాలు కప్పి, మెమెంటో లను అందించి సత్కరించారు. పత్రికల్లో వచ్చే వార్తల్లో ఫోటోలకు ప్రత్యేక స్థానముందని, ఎన్నో పదాల్లో చెప్పలేని భావాలను ఒక్క ఫోటో ద్వారా చెప్పవచ్చని అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులైన ఫోటో జర్నలిస్టులు గవర్నర్ చేతులమీదుగా అవార్డులు అందుకోవటం గర్వకారణమని అన్నారు. ఫోటో జర్నలిస్టులకోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీకి, ప్రధాన కార్యదర్శి రాంనారాయణకి, ఫొటో జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, కేఎన్ హరికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షులు బొడిగె శ్రీను, యంసాని శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ గుంటి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# నీ ఫాంహౌస్ లీలలన్నీ బయట పెడతాం

- కేటీఆర్ పై టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఫైర్



అక్షరదర్బార్, హైదరాబాద్: మాజీమంత్రి కేటీఆర్ అధికార బలంతో జన్వాడ ఫామ్ హౌస్ లో నడిపించిన అక్రమ వ్యవహారాలన్నీ త్వరలోనే ప్రజల ముందు బయటపెడతామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. కేటీఆర్ శని, ఆదివారాల్లో ఫాంహౌస్ లో విచ్చలవిడిగా సాగించిన లీలలు, ప్రైవేట్ జెట్ విమానాల్లో చేసిన విహార యాత్రల వివరాలన్నీ త్వరలోనే వెల్లడిస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మంచి పేరు తెచ్చుకోవడాన్ని జీర్ణించుకోలేని కేటీఆర్ బ్లాక్ మెయిలింగ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అధికారం కోల్పోయిన కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్రంలో బీజేపీ కూడా కాంగ్రెస్ పై తప్పుడు ప్రచారం చేస్తూ కాలం వెల్లదీస్తున్నదని విమర్శించారు. కేటీఆర్ చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేస్తున్నాడని, కేటీఆర్ కు త్వరలోనే గుణపాఠం తప్పదని బండి సుధాకర్ హెచ్చరించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ బుద్ధి తెచ్చుకొని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని బండి సుధాకర్ గౌడ్ డిమాండ్ చేశారు.

# 3 గ్రూపులుగా 59 కులాలు

- ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం
- మద్దతిచ్చిన అన్ని పార్టీల సభ్యులు



సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్న సీఎం

అక్షరదర్బార్, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ హేతుబద్ధీకరణ బిల్లుకు శాసనసభ ఆమోద ముద్ర వేసింది. 59 ఎస్సీ కులాలను 3 గ్రూపులుగా వర్గీకరిస్తూ బిల్లు ఆమోదించారు. గ్రూప్-1లోని అత్యంత వెనుకబడిన 15 కులాలకు 1 శాతం రిజర్వేషన్, మాదిగలున్న గ్రూప్-2లోని కులాలకు 9 శాతం రిజర్వేషన్లు, మాలలు ఉన్న గ్రూప్-3లోని కులాలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో ఏ ఒక్కరికీ అన్యాయం జరకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతోమంది ప్రాణాలు అర్పించారన్న ముఖ్యమంత్రి తాను సీఎంగా ఉన్నప్పుడు సమస్య పరిష్కారం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సులు చేసిందని వెల్లడించారు.

## సభ్యులకు సీఎం కృతజ్ఞతలు

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించామని సీఎం రేవంత్ అన్నారు. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించామని, మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించామని, కమిషన్ ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించిందని వివరించారు. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించామని, 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించిందని, 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సాగునీరు అందించాలి

- డీబీఎం 38 కెనాల్‌ను పునరుద్ధరించాలి
- నాలుగు మండలాలను సస్యశ్యామలం చేయాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




అక్షరదర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి నియోజకవర్గంలోని డీబీఎం 38 కెనాల్‌ను పునరుద్ధరించి పంట పొలాలకు సాగు నీరందించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. ఈమేరకు అసెంబ్లీలో మంగళవారం డీబీఎం 38 కెనాల్ మరమ్మతుపై ఆయన మాట్లాడారు. గతంలో 1988లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేశారన్నారు. 35 సంవత్సరాలు గడుస్తున్నా.. 82 కిలోమీటర్లు ఉన్న కాలువ నిరుపయోగంగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో అనేకసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. 2028, 19లో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 200 కోట్లు ఖర్చు చేసినా చుక్క నీరు రాలేదన్నారు. 44 వేల పైచిలుకు ఎకరాలకు సాగు నీరందించే , గోరికొత్తపల్లి, రేగొండ, చిట్యాల, టేకుమట్ల మండలాలకు సస్యశ్యామలం చేసే కెనాల్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఫేజ్ టూ దేవాదుల నుంచి చలివాగుకు వచ్చే లైన్‌కు గోరికొత్తపల్లి వద్ద లింక్ కలిపితే ఈ నాలుగు మండలాలకు నీరందుతుందని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని గండ్ర కోరారు.

# దేవాదుల ఫేజ్-3 పంప్ హౌజ్ మోటార్లు ప్రారంభం

- మంత్రులు ఉత్తమ్, పొంగులేటికి ఘన స్వాగతం
- హాజరైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు

అక్షరదర్బార్, హన్మకొండ: హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల ఫేజ్ 3 ప్యాకేజీ పంప్ హౌస్ మోటార్లను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా దేవన్నపేటలోని దేవాదుల పంపు హౌస్ వద్దకు చేరుకున్న మంత్రులకు హెలీప్యాడ్ వద్ద స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితోపాటు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతంపలికారు.

# చీటింగ్..

- ఓ అటవీ అధికారి మోసం
- వ్యక్తిగత అకౌంట్ లో తునికాకు బోనస్ , కూలీల డబ్బు జమ
- కేసు నమోదుతో నాకేం తెలియదని బుకాయిస్తున్న అధికారి




అక్షరదర్బార్, ఏటూరునాగారం: అటవీశాఖలో పనిచేసే సిబ్బందిని ఓ అధికారి మోసం చేసి వారి వ్యక్తిగత పేర్లమీద బ్యాంకు ఖాతాల్లో డబ్బు వేయించి డ్రా చేయించాడని తెలిసింది. ఆ డబ్బులు అక్రమంగా తీసుకున్నారని ఏడుగురిపై కేసు కావడంతో నాకేం తెలియదని సదరు అధికారి చేతులు ఎత్తేయడం వల్ల సిబ్బంది తలలు పట్టుకున్న సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే 2023 ఆగస్టు నెలలో తునికాకు బోనస్ డబ్బులు ప్రభుత్వం తునికాకు కూలీలకు మంజూరు చేసింది. అప్పుడు మండల కేంద్రంలో పనిచేసిన ఓ అధికారి అటవీశాఖలో తాత్కాలికంగా పనిచేసే సిబ్బంది ఖాతాల్లో నగదును వేయించారు. ఒక్కొక్కరి ఖాతాలో రూ.20 నుంచి రూ.39 వేల వరకు వేసి వాటిని తిరిగి వారితోనే డ్రా చేయించాడు. అ క్రమంలో కూలీలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఎట్టకేలకు ఏడుగురు వ్యక్తుల్లో తునికాకు కూలీల డబ్బులు జమ అయినట్లు గుర్తించారు. దీంతో వారిపై ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. కానీ ఈ డబ్బులను ఆ సిబ్బంది ఖాతాలో జమ చేయించిన అధికారిపై ఎలాంటి కేసు కాకపోగా ఆ సిబ్బందికి నేను డబ్బులు ఇచ్చినట్లు ఏమైనా సాక్ష్యాలు ఉన్నాయా అని సదరు అధికారి బుకాయిస్తున్నాడని సమాచారం. దీంతో ఆ పేద వర్గానికి చెందిన ఏడుగురు జైలుకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# విద్యార్థులు పట్టుదలతో చదవాలి

- లయన్స్ క్లబ్ అడిషనల్ క్యాబినెట్ సెక్రెటరీ మామిడాల రమేష్ బాబు

అక్షరదర్బార్, వరంగల్: విద్యార్థులు పట్టుదలతో చదివి... చదువు చెప్పిన ఉపాధ్యాయులకు చదివించిన తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని లయన్స్ క్లబ్ అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ మామిడాల రమేష్ బాబు అన్నారు. మంగళవారం లేబర్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉషోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10 వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమేష్ బాబు హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక గోల్ పెట్టుకుని ముందుకు సాగితే తప్పక అనుకున్న లక్ష్యంకు చేరుకుంటారని తెలిపారు. మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ అల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ యూత్ సభ్యులు బొమ్మగల్ల వంశీ, కుందారపు రామకృష్ణ, పందిరి గోపి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915